జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో జరిగిన సమావేశంలో కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు.. స్థలం, భవన నిర్మాణానికి హామీ

ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ హామీనిచ్చినట్లు కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కాలేజ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అండ్ రివ్యూ కమిటీ (డీసీఈడీఆర్‌సీ) సమావేశంలో జిల్లా పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఆయా డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులు, నిర్వహణపై చర్చించారు. సమావేశానికి హాజరైన కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం, తాగునీటి వసతి, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అణువైన స్థలాన్ని గుర్తించి ఆ స్థలంలో భవన నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, కో ఆర్డినేటర్స్, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యనందించినప్పుడే..మంచి ఫలితాలు



వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల,మార్చి1: విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ ఎంజేఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ 27వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వళన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలతో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.సురేశ్‌రెడ్డి, మండల ఎడ్యుకేషన్ అధికారి ఆంజనేయులు, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికి మనమేమైనా చేయాలి

వర్సిటీలో ఎల్క్ట్రికల్ వస్తువుల ప్రదర్శన ప్రారంభోత్సవంలో వీసీ కట్టా నర్సింహారెడ్డి తదితరులు

వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : దేశం మన కేమి ఇచ్చిందని కాకుండా.. ముందు తరాలకు దేశానికి మనం ఏమి ఇచ్చారన్న ధోరణితో విద్యార్థులు విభిన్నమైన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో సైడర్ ఎల్క్ట్రికల్ కంపెనీ ఉత్పత్తి చేసిన పలు ఎల్క్ట్రికల్ వస్తువుల ప్రదర్శన కార్యక్రమాన్ని వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలుష్యం లేకుండా మన అవసరాలను ఎలా తీర్చుకోవచ్చు అన్న విషయంలో సైడర్ కంపెనీ గొప్ప పరిశోధనలు చేసి మంచి పరిష్కార మార్గాలు చూపడం అభినందనీయమన్నారు. రోజుకు కరెంటు సమస్యలు పెరుగుతున్నాయని కంపెనీలలో విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. థర్మల్‌పవర్ కోసం బొగ్గు తవ్వి కరెంటు ఉత్పత్తి చేయడం వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కంపెనీలలో లోడ్ ఎక్కువ కావడం కంట్రోల్ సిస్టమ్ సరిగా పని చేయని కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి పలు విధాలుగా నష్టం వాటిల్లుతుందన్నారు. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలు చేసి నూతన ఆవిష్కరణలు రాబట్టాలన్నారు. దేశం కోసం, సమాజహితం కోసం కొత్త పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, మెకానికల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పి.భ్రమర, పీఆర్‌వో ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను లక్ష్యం రూ.81.35 కోట్లు

- కుత్బుల్లాపూర్,గాజులరామారం సర్కిళ్లలో ఇప్పటి వరకు రూ.62.98 కోట్లు వసూళ్లు
- ఇంకా వసూలు చేయాల్సింది రూ.18.37 కోట్లు..
- ఓటీఎస్‌తో టార్గెట్‌పై ఆశలు.
- పన్ను మదింపులో కిందిస్థాయి అధికారుల ఇష్టారాజ్యం

కుత్బుల్లాపూర్,మార్చి1: కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్లలో ఆస్తి పన్ను వసూళ్లపై అధికారయంత్రాగం క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన టార్గెట్‌ను చేరేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. 2023-24 సంవత్సరానికి సర్కిల్ 25,26లకు కేటాయించిన మొత్తం రూ.81 కోట్లు టార్గెట్ ఇవ్వగా దీనిలో ఇప్పటి వరకు రూ.62.98 కోట్లు వసూలు అయినట్లు అధికారయంత్రాంగం తెలుపుతున్నది. కాగా మిగిలిన రూ.18.37 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మార్చి 1 నుంచి ప్రభుత్వం మొండిబకాయిల వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటీఎస్(ఒన్‌టైం సెటిల్‌మెంట్) అవకాశాన్ని కల్పించింది. దీని ద్వారా పన్నుకు అనుసందానంగా జోడించిన వడ్డీలో 90 శాతం మాఫీ చేసి చెల్లించేందుకు అవకాశం ఉంది. అధిక మొత్తంలో చెల్లించే పన్నుదారులకు ఈ అవకాశం అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా 17,684 అసెస్‌మెంట్ల ద్వారా ఓటీఎస్ కింద పన్ను చెల్లించాల్సి ఉంది.

ఒక వైపు టార్గెట్.. మరోవైపు కిందిస్థాయి అధికారుల మదింపు

కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్లకు కేటాయించిన పన్ను లక్ష్యాన్ని చేరేందుకు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటుండగా మరోవైపు కిందిస్థాయి అధికారులు పన్ను వసూళ్లలో మదింపు చేస్తున్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయి. పన్ను చెల్లింపుదారులకు వివిధ రకాల కారణాలు చూపుతూ మొత్తాన్ని చెల్లించలేని వారి వద్ద నుంచి మామూళ్లు దండుకొంటూ తక్కువ స్థాయి పన్నును వర్తించేలా పలు చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పన్ను విధింపు సమయంలో పరీక్షల కోసం వచ్చిన కిందిస్థాయి అధికారులకు ఎంతోకొంత ముట్టచెప్పుకొని తక్కువ విస్తీర్ణం చూపిస్తూ పన్నును మదింపు చేస్తున్నారనే ఆరోపణలకు తావునిస్తుంది. అధికారుల చేతివాటం ద్వారా మున్సిపల్‌కు రావాల్సిన ఖాజానకు గండిపడే అవకాశాలు లేకపోలేదు. దీనిపై ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నప్పటికీ శరమామూలుగానే చూడడం గమనార్హం.

అసెస్‌మెంట్‌లో జేబులు నింపుకుంటున్న వైనం..

ఇంటి నంబర్లపై ఆస్తిపన్నును రూపొందించేందుకు ముందుగా అసెస్‌మెంట్‌ను పలు నిబంధనల మేరకు చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అసెస్‌మెంట్లు చేసేందుకు ముడుపులు ముడితే కానీ ఫైలు ముందుకు కదిలేది లేదంటూ బాహాటంగా చర్చ జరుగుతున్నది. దీనికి తోడు ప్రభుత్వ, ఇతర స్థలాల్లో ఎలాంటి రూంలు లేకుండా అప్పటికప్పుడు తాత్కలిక రూంలు ఏర్పాటు చేసి అసెస్‌మెంట్లు జారీ చేసిన అనంతరం పూర్తి రిజిస్ట్రేషన్‌కు అర్హులుగా ఉండేలా సర్కిల్ కార్యాలయాల అధికారులు తలుపులు తెరుస్తున్నట్లు సమాచారం.

కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు

మేడిగడ్డకు మరమ్మతులు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ.వివేకానంద్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : కరువు కాటకాలతో తల్లడిల్లిన తెలంగాణను కాళేశ్వరం ప్రాజెక్టుతో సస్యశ్యామలంగా మార్చిన అపరభగీరథుడు మాజీ సీఎం కేసీఆర్ అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మేడిగడ్డ ప్రాజెక్టును ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి ప్రాణహిత నీళ్లు ఆంధ్ర ప్రాంతానికి తరలిపోతున్నా పట్టించుకున్న నాథుడే లేడని.. రైతాంగం తాగునీటి కోసం కష్టాలు పడ్డా ఆదుకున్న వారే లేరన్నారు. ప్రత్యేక రాష్ట్ర వచ్చిన తర్వాత గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారాజ్‌లను నిర్మించి వాటిద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు ఎత్తిపోతలతో సాగునీటిని తరలించారన్నారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగి సస్యశ్యామలంగా మారిందన్నారు. మేడిగడ్డ బారేజ్‌లోని రెండు పిళ్లర్లు కుంగిన విషయంపై కాంగ్రెస్ పార్టీ నేతలు మొత్తం ప్రాజెక్టుపైనే విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, శిరీషాబాబూరావు, సబీహాబేగం, సతీశ్‌గౌడ్, ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : కేపీహెచ్‌బీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ కాలనీ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ శ్రీవేద హాస్టల్‌లో నివాసముంటున్న నందిగామ సాయితేజ, కొత్తపల్లి నాగశ్రీనివాస్ కలిసి ఉంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సాయికుమార్ వద్ద రూ.2వేలకు కేజీ గంజాయిని తీసుకొచ్చి కేపీహెచ్‌బీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు ఆ గంజాయిని విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌వోటీ టీమ్, కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు కలిసి కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో రమ్యా గ్రౌండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న సాయితేజ, నాగశ్రీనివాస్ లను అదుపులోకి తసుకున్నారు. వారివద్ద 750 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

యుగేంధర్ తల్లికి చెక్కును అందజేస్తున్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్, మార్చి 1: కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లో సేవలందిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన కానిస్టేబుల్ జీ యుగేంధర్ కుటుంబానికి బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ రూ.83,500ల చెక్‌ను అందజేశారు. శుక్రవారం బెటాలియన్‌లోని తన కార్యాలయంలో యుగేంధర్ తల్లి రఘునమ్మకు కోఆపరేటివ్ క్రిడిట్ సొసైటీ నుంచి రావాల్సిన మొత్తాన్ని చెక్ రూపంలో అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులు, సిబ్బందిని అన్నివిధాల ఆదుకునేందుకు బెటాలియన్ సిద్ధంగా ఉంటుందన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి..

కుత్బుల్లాపూర్,మార్చి1: ఎస్సీవర్గీకరణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్ చౌరస్తాలో వారి చిత్రపటాలకు నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ మాట్లాడుతూ.. మాదిగ అమరవీరుల త్యాగం వృధాకాదని, సుప్రీం కోర్టులో ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడించేందుకు విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిలివేరు శ్రీనివాస్‌మాదిగ, సంఘీ మహేశ్, ఇసురం రమేశ్, కురమయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో జీరో కరెంట్ బిల్లులు జారీ

జీరో కరెంట్ బిల్లు అందజేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

బాలానగర్, మార్చి 1 : గృహ జ్యోతి పథకానికి అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింప చేయనున్నట్లు బాలానగర్ విద్యుత్ ఏడీఈ సాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఫిరోజ్‌గూడ సెక్షన్ పరిధిలోని దామోదరం సంజీవయ్యనగర్, గౌతమ్‌నగర్, పెన్షన్ లైన్, బాలానగర్ సెక్షన్ పరిధి ప్రభాకర్‌రెడ్డినగర్, ఎల్బీస్‌నగర్, పిట్టల బస్తీలలో బాలానగర్ ఏడీఈ సూర్య ప్రకాశ్ ఆధ్వర్యంలో విత్యుత్ సిబ్బంది అర్హులకు జీరో కరెంట్ బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహ పథకానికి లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి రేషన్ కార్డు కలిగి ఉండి 200 యూనిట్లు లోపల విద్యుత్‌ను వినియోగించే వినియోగదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిరోజ్‌గూడ సెక్షన్ ఏఈ రాణి బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 9, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 28, క్యాబేజి 25, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 45, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 60, ఆలుగడ్డ 23, కీరా 18, దోసకాయ 16, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 57, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 24, చింతకాయ 70, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముల్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 15, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చి బఠాని 47, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 140, వెల్లుల్లి 200, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

మళ్లీ కుంగింది..

ప్రణీత్ సెల్లార్ నిర్మాణంతో కుప్పకూలిన రహదారి

సెల్లార్ నిర్మాణం కారణంగా కుంగిన రోడ్డు

మియాపూర్, మార్చి 1 : హైదర్‌నగర్ డివిజన్‌లో ప్రణీత్ నిర్మాణ సంస్థ భారీ నిర్మాణం కోసం చేపడుతున్న సెల్లార్ సందర్భంగా శుక్రవారం సాయంత్రం మరోసారి రహదారి కుప్పకూలింది. సెల్లార్ నిర్మాణానికి భారీ గుంతను తీయగా.. నాసిరకంగా చేపడుతున్న రిటైనింగ్ వాల్ పనుల నేపథ్యంలో మూడోసారి ఈ పరిణామం చోటు చేసుకున్నది. గత జూన్ మాసంతో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన.. తాజాగా శుక్రవారం మూడోసారి సెల్లార్ కుంగింది. దీంతో సెల్లార్ నిర్మాణాన్ని ఆనుకుని ఉన్న గౌతమీ కాలనీ రహదారి సైతం కుంగిపోయింది. కుంగిన సమయంలో రహదారిపై వాహనాలేవి లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అయితే ప్రణీత్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ సెల్లార్ పక్కనే రహదారిని ఆనుకుని పెద్ద మొత్తంలో నివాస భవనాలున్నాయి. తొలి నుంచి ఈ నిర్మాణంతో భయాందోళనలు వ్యక్తం చేస్తున్న స్థానికులు తాజాగా మరోసారి రహదారి కుంగటంతో ఉలిక్కిపడ్డారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి జాగ్రత్తలు పాటించకుండా నిర్మాణ పనులను సంస్థ నిర్వాహకులు కొనసాగిస్తున్నారని కాలనీ వాసులు తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. అధికారులకు దీనిపై ఎన్ని మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోతుండటంతో ప్రాణ భయంతో కాలం గడుపుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సంఘటనా స్థలాన్ని డీఆర్ఎఫ్ బృందం సందర్శించింది. స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు అధికారులను కోరారు.

గుండెకు అరుదైన శస్త్ర చికిత్స

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 1 : కూకట్‌పల్లిలోని అమోర్ వైద్యశాలలో 99 శాతం బ్లాక్ అయిన గుండె నాళంలో స్టంట్ అమర్చి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వైద్యశాల కార్డియాలజిస్ట్ ఇమ్రాన్‌ఉల్‌హక్ తెలిపారు. నగరానికి చెందిన ఒక వ్యక్తి ఎడమ చేయి లాగడం, చెమట పట్టడం, గుండెలో ఇబ్బందిగా అనిపించడం లాంటి లక్షణాలు కనిపించిన వెంటనే అమోర్ వైద్యశాలను సందర్శించాడు. వెంటనే పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు గుండె నాళంలో 99శాతం పూడిక ఉందని..వెంటనే స్టంట్ వేయాల్సిన వస్తుందని బంధువులకు సూచించగా వారు అంగీకరించడంతో వెంటనే సంబంధిత శస్త్ర చికిత్సను ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్‌కు, సహాయక సిబ్బందికి యాజమాన్యం అభినందనలు తెలిపారు.

శాస్త్రీయవిజ్ఞానంతోనే భవిష్యత్

జగద్గిరిగుట్ట, మార్చి 1: పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథంతో చదువుసాగిస్తే భవిష్యత్ గొప్పగా ఉంటుందని ఉపాధ్యాయులు సూచించారు. జగద్గిరిగుట్ట డివిజన్ మఖ్దూంనగర్‌లోని చైతన్యవిద్యా నికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి పర్యవేక్షణలో గ్రాడ్యుయేషన్‌డే, సైన్స్‌ఫెయిర్ జరిగింది. పాఠశాల ప్రతినిధులు మంగదేవి, డాక్టర్‌శృతివిద్య, నిఖిల్, సాయితేజ, సరిత, గీత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో సుమ సందడి

శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో నటి, ప్రముఖ వ్యాఖ్యాత సుమ కనకాల శుక్రవారం సందడి చేసారు. ఇక్కడి ఆదిత్యనగర్‌లో వైద్య దంపతులు డాక్టర్ నెల్లుట్ల మాధురి, డాక్టర్ నెల్లుట్ల సృజన్ కుమార్‌లు గ్రామీణ వాతావరణ నేపథ్యంతో ఏర్పాటు చేసిన అథెంటిక్ ఈట్స్ సౌథర్న్ కేఫ్‌ను యాంకర్ సుమ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నెల్లట్ల రంగారావు, డాక్టర్ రామ్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 1